


షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152




సంపుటి : 2 సంచిక : 179 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 21 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 179 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 21 May 2025 PAGES : 8 PRICE : 3/-


## సుప్రీంకోర్టులో వక్ఫ్ చట్టంపై విచారణ..

మధ్యంతర ఉత్తర్వులపై కేంద్రం కీలక సూచన

వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంలో విచారణ

మధ్యంతర ఉత్తర్వులు మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరిన కేంద్రం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 20)

కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు

కేంద్రం వాదనను వ్యతిరేకించిన పిటిషనర్ల తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, మనుసింఘ్వీ వక్ఫ్ చట్టం 1995లోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయదలచుకుంటే, వాటిని కేవలం మూడు కీలక అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది.

విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గతంలో ఈ కేసును విచారించిన ధర్మాసనం గుర్తించిన మూడు అంశాలకే ప్రస్తుత విచారణను కూడా పరిమితం చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మూడు అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తమ సమాధానాలను, అఫిడవిట్‌ను దాఖలు చేసిందని ఆయన గుర్తుచేశారు. అయితే, పిటిషనర్లు తాజాగా దాఖలు చేసిన లిఖితపూర్వక సమర్పణల్లో మరిన్ని కొత్త అంశాలను లేవనెత్తుతున్నారని, ప్రస్తుతానికి విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలని ఆయన అభ్యర్థించారు.కేంద్ర ప్రభుత్వ వాదనలను పిటిషనర్ల తరపు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ... సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని అంగీకరించలేదు. -మిగతా 2లో

# జగన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడతారు

తిరుపతి విద్యార్థి ఘటనను జగన్ రాజకీయం చేస్తున్నారు: లోకేశ్

టీడీపీపై దుష్ప్రచారానికి సాక్షి పత్రికను వాడుకుంటున్నారని ఆరోపణ

జేమ్స్‌పై దాడి నిందితులు వైసీపీ నేతల అనుచరులేనని వెల్లడి

జగన్‌దే రక్తచరిత్ర అని విమర్శలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 20)

తిరుపతిలో ఓ దళిత విద్యార్థిపై జరిగిన దాడి ఘటనను అడ్డం పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ నేతల అనుచరులేనని, అయినప్పటికీ టీడీపీపై బురద చల్లేందుకు జగన్, ఆయన కరపత్రిక సాక్షి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.ఈ నెల 15వ తేదీ రాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడి చేసిన ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏ-1 యశ్వంత్, ఏ-2 కిరణ్, ఏ-3 జగ్గ, ఏ-4 లలిత్, ఏ-5 సాయి గౌడ్, ఏ-6 వంశీ, ఏ-7 రూపేష్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారని తెలిపారు. వీరిలో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్ అలియాస్ లలిత్ గోపాల్, నాని, సాయి గౌడ్‌లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులని ఆరోపించారు. అలాగే, ఉండు రూపేష్ రెడ్డి అలియాస్ రూపి, సాయి కిరణ్ కుమార్ రెడ్డిలు భూమన అభినయ్ రెడ్డి వద్ద పనిచేసేవారని, వంశీ అలియాస్ చోటా బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడని లోకేశ్ పేర్కొన్నారు. “వాస్తవాలు ఇలా ఉంటే, టీడీపీ వారే జేమ్స్‌ను -మిగతా 2లో

## ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన .. అధికారుల గుండెల్లో గుబులు


జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తానని పేర్కొన్న సీఎం చంద్రబాబు

ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందేనని వెల్లడి

ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలని సూచన

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 20)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుతున్న రేషన్, దీపం, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎంవో కార్యదర్శులతో సమీక్షించారు. -మిగతా 2లో



## ఏపీలో రేషన్ విధానంలో కీలక మార్పు...

వారికి మాత్రం మినహాయింపు!

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానం రద్దు

జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారానే రేషన్ సరఫరా

65 ఏళ్లు పైబడిన వృద్ధులకు మాత్రం ఇంటికే సరుకులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 20)

ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ పంపిణీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. జూన్ 1 నుంచి చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) ద్వారానే రేషన్ సరుకుల సరఫరా జరుగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అయితే, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రం గతంలో మాదిరిగానే ఇంటికే నేరుగా సరుకులు అందజేస్తామని ఆయన తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం, కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారధితో కలిసి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరాలు వెల్లడించారు.గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 29 వేల చౌక దుకాణాల ద్వారా బియ్యం సహా ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ సమర్థవంతంగా జరిగేదని మంత్రి గుర్తుచేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) పేరిట ఈ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. “9,260 మొబైల్ వాహనాల కోసం అనవసరంగా రూ.1860 కోట్లు వృధా చేశారు. ఈ విధానం వల్ల లబ్ధిదారులు తమ ఇబ్బందులను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా దాదాపు 30 శాతం మందికి రేషన్ అందడం లేదని మా దృష్టికి వచ్చింది” అని నాదెండ్ల మనోహర్ వివరించారు.రేషన్ సరఫరాకు వాహనాలు వచ్చిన తర్వాత జవాబుదారీతనం లోపించిందని, సరుకులు ఎటు వెళుతున్నాయో కూడా తెలియని దుస్థితి ఏర్పడిందని మంత్రి విమర్శించారు. ఈ వాహనాల ఆపరేటర్లపై వందల సంఖ్యలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, బియ్యం అక్రమ రవాణా కోసం ఏకంగా ఒక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. “రాష్ట్రంలో 29 వేల రేషన్ దుకాణాలు ఉంటే, కేవలం -మిగతా 2లో

## విశాఖ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన గోవిందరెడ్డికి పవన్ కల్యాణ్ అభినందనలు

విశాఖ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరెడ్డి ఏకగ్రీవం

తమ పార్టీ నేతకు కీలకపదవి దక్కడం పట్ల పవన్ హర్షం

అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 20)

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గోవిందరెడ్డి విశాఖ 64వ డివిజన్ లో జనసేన కార్పొరేటర్ గా ఉన్నారు. తమ పార్టీకి చెందిన నేత డిప్యూటీ మేయర్ కావడం పట్ల జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన దల్లి గోవిందరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. “64వ డివిజన్ లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గోవిందరెడ్డి పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలకు అనుగుణంగా అనునిత్యం పనిచేస్తారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయం. గోవిందరెడ్డి డిప్యూటీ మేయర్ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తారని, నగర అభివృద్ధికి, మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తారని, సదా ప్రజల పక్షాన నిలుస్తారని ఆకాంక్షిస్తున్నాను” అంటూ పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.



# అఖిలపక్ష బృందాలపై రగడ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 20)

సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటు చేసిన అఖిలపక్ష బృందాల్లోని పేర్లపై రాజకీయ రగడ రాజుకుంది. పేర్ల ఎంపికను పార్టీలకే వదిలేయాల్సిందని పార్టీలు అంటుండగా.. అది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయమని, ఏ పార్టీకీ సభ్యుల ఎంపికకు అవకాశం ఇవ్వలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

**రిజిజు వ్యాఖ్యలను తప్పుబట్టిన కాంగ్రెస్**

రిజిజు వ్యాఖ్యలు పూర్తిగా సత్యదూరమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోమవారం మండిపడ్డారు. తాము ఎంచుకున్న పేర్లను ఆమోదించకపోవడం చౌకబారు రాజకీయమని విమర్శించారు. ‘ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలే కాంగ్రెస్‌కు ముఖ్యం. ఒకే దేశం.. ఒకే సందేశం అనే భావనతో ఉగ్రవాదంపై మనం పోరాడాలి. మొదటి నుంచీ విభజించి పాలించు సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న భాజపా ఈ అంశంపైనా అదే చేస్తోంది. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో ఫోన్‌లో అయినా చర్చించి ఉండాల్సింది’ అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సిఫార్సు చేసిన ఆనంద్ శర్మ, గౌరవ్ గొగొయ్, సయ్యద్ నసీర్ హుసేన్, అమరీందర్ సింగ్‌లలో ఆనంద్ శర్మకే ఈ బృందాల్లో చోటు దక్కింది. ఆ పార్టీ నేతలు శశి థరూర్, మనీశ్ తివారీ, అమర్ సింగ్, సల్మాన్ ఖుర్షీద్‌లను సిఫార్సు చేయకున్నా అఖిలపక్ష బృందంలో ప్రభుత్వం చేర్చింది. ఈ అంశంపైనే కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. -మిగతా 2లో



## ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం..

యూసఫ్ ఔట్.. అభిషేక్ బెనర్జీ ఇన్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 20)

ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాలు విదేశాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అందులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహంపుర్‌కు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూసఫ్ పఠాన్ ను కేంద్రం ఎంపిక చేయడాన్ని ఆ పార్టీ తప్పు బట్టడంతో ఆయన ఈ బృందం నుంచి తప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో యూసఫ్ స్థానంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ (%జులీనీరిరీనీలిది ఔబిదీలిజీశీలిలి%)ని ఆ పార్టీ ఎంపిక చేసింది. దీనిపై టీఎంసీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో తమ పార్టీ తరఫున అభిషేక్‌ను ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బెంగాల్ దృఢ వైఖరిని ఆయన ప్రతిబింబించడమే కాకుండా..ప్రపంచ దేశాల్లో భారత ప్రజల సమష్టి స్వరాన్ని వినిపిస్తారని తెలిపింది.ప్రతినిధి బృందంలో యూసఫ్ పేరును చేర్చడంపై అభిషేక్ బెనర్జీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశాన్ని రక్షించడం వంటి జాతీయ భద్రత విషయాలపై తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని.. కానీ, తమను సంప్రదించకుండా పఠాన్‌ను దౌత్యబృందంలో చేర్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒక పార్టీ ఎంపీని ఎంపిక చేసేటప్పుడు ఆ పార్టీతో సంప్రదింపులు జరపాలని కేంద్రానికి సూచించారు. ఈ వ్యాఖ్యలు -మిగతా 2లో



## బీఎస్పీ ముఖ్య సమన్వయకర్తగా ఆకాశ్

మేనల్లుడికి కీలక బాధ్యతలు అప్పగించిన మాయావతి

మాయావతితో ఆకాశ్ ఆనంద్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 20)

బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌కు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఆకాశ్‌ను పార్టీలోకి తీసుకున్న నెల తర్వాత ఆయనను బీఎస్పీ జాతీయ ముఖ్య సమన్వయకర్తగా నియమిస్తున్నట్లు మాయావతి ప్రకటించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీలోని ముగ్గురు జాతీయ సమన్వయకర్తలకు ఆకాశ్ మార్గనిర్దేశనం చేస్తారు. ఆకాశ్ ఆనంద్ కోసం మాయావతి ప్రత్యేకంగా ఈ పదవిని సృష్టించారు. దీంతో ఆయన బీఎస్పీలో రెండోస్థానంలో ఉన్నారు.

## మొదటిపేజీ తరువాయి

# జగన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడతారు

కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ సాక్షిలో తప్పుడు కథనాలు రాయించారు. రాజకీయ లబ్ధి కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడే జగన్ రెడ్డి, విద్యార్థుల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవను మా పార్టీపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. దళిత సోదరులను రెచ్చగొట్టేలా తమ కరపత్రిక సాక్షిలో తప్పుడు రాతలతో విషం చిమ్ముతున్నారు" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తిరుపతి ఘటనలో ఇప్పటికే కొందరిని అరెస్టు చేశారని, మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారని, నిందితులు ఎవరైనా, ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని ఆయన స్పష్టం చేశారు.

"రాజకీయంగా జగన్ రెడ్డి గారి హిస్టరీ యావత్తు ఆసాంతం రక్తచరిత్రే. బాబాయిని బాత్రూమ్‌లో గొడ్డలివేటుతో లేపేసి, బాబుగారి చేతిలో కత్తి పెట్టి, నాడు అవినీతి విషపుత్రిక సాక్షిలో అడ్డగోలు రాతలు రాయించారు. అసలు నిజమేంటో సొంత చెల్లెళ్లతో సహా రాష్ట్ర ప్రజలంతా ఆలస్యంగా తెలుసుకున్నారు" అని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉండగా డాక్టర్ సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు దళిత సోదరులను ఊచకోత కోసిన జగన్, ప్రతిపక్షంలోనూ అవే పోకడలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి ఘటనలో వాస్తవాలను, జగన్ రెడ్డి కుట్రలను గుర్తించి యావత్ దళిత సమాజం అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో రేషన్ విధానంలో కీలక మార్పు...

9 వేల వాహనాలు ఎలా సరిపోతాయి? దొంగ లెక్కలు చూపించి పెద్ద ఎత్తున బియ్యాన్ని పక్కదారి పట్టించారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.27 వేల చొప్పున పౌరసరఫరాల శాఖ చెల్లిస్తూ వచ్చింది. ఇన్ని లోపాలను గుర్తించి, అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ ఎండీయూ వాహనాల విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయించాం," అని ఆయన తెలిపారు.కొత్త విధానం ప్రకారం, ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చౌక ధరల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, జూన్ 1 నుంచి రేషన్ పంపిణీ కేవలం ఈ దుకాణాల ద్వారానే జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న 9,260 వాహనాలను ఆయా లబ్ధిదారులకు ఉచితంగా బదలాయించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ నిర్ణయంతో ప్రజాధనం ఆదా అవ్వడమే కాకుండా, పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# అఖిలపక్ష బృందాలపై రగడ

**కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు మాకు అక్కర్లేదు: రిజిజు**

కాంగ్రెస్ వాదనను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. తాను ఖర్గే, రాహుల్ గాంధీలతో మాట్లాడినట్లు వెల్లడించారు. అఖిలపక్ష బృందాల ఏర్పాటుపై వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున సమాచారం ఇచ్చానని తెలిపారు. 'కాంగ్రెస్ ఎంపీలకు అఖిలపక్ష బృందాల్లో చోటు కల్పించాం. అయినా కొందరు ఎంపీలకు అవకాశం ఇవ్వనందుకు ఆ పార్టీ చౌకబారు రాజకీయం చేస్తోంది. కాంగ్రెస్ నేతలు శశి థరూర్, మనీశ్ తివారీలకు విదేశీ వ్యవహారాలపై మంచి అవగాహన ఉంది. అందుకే వారిని ఎంపిక చేశాం. ఇలాంటి సమర్థుల పేర్లను కాంగ్రెస్ సూచించలేకపోయింది. కాంగ్రెస్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, అమర్ సింగ్‌లకూ అఖిలపక్ష బృందాల్లో స్థానం కల్పించాం. వాళ్ల గురించి కాంగ్రెస్ ఏమంటుంది' అని రిజిజు ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు, ఆ పార్టీ పెద్దల ఈర్ష్య, అసూయ, అభద్రతల గురించి మాకు అవసరం లేదు. విదేశీ పర్యటనకు వెళ్లే అఖిలపక్ష బృందాలు భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. వాటిలో సమర్థులకే మేం చోటు ఇవ్వగలం. అలాంటి వాళ్లనే అన్ని పార్టీల నుంచి ఎంపిక చేశాం. ఈ అంశంలో ఎవరి సిఫార్సులూ పని చేయవు' అని కేంద్ర మంత్రి తేల్చి చెప్పారు.

**పార్టీలే ఎంపిక చేయాలి : మమతా బెనర్జీ**

కేంద్రం తమను సంప్రదిస్తే పార్టీ ఎంపీలను తప్పకుండా విదేశీ పర్యటనకు పంపుతామని, ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారం తమకు అందలేదని తృణమూల్ అధ్యక్షురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. 'ప్రతినిధుల బృందానికి అభ్యర్థుల పేర్లను ఎంపిక చేసే అధికారం ఆయా పార్టీలకే ఉండాలి. కేంద్రానికి కాదు' అని ఆమె అభిప్రాయపడ్డారు. తృణమూల్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌ను అఖిలపక్ష బృందానికి ఎంపిక చేసిన అంశంపై స్పందిస్తూ.. మమత ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం..

చేసిన మరునాడే ఆయన పేరును పార్టీ తరఫున బృందంలో చేర్చడం గమనార్హం.

పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత్ దౌత్యయుద్ధం ప్రారంభించింది. ఇందులోభాగంగా మొత్తం 51 మంది నేతలు 7 బృందాలుగా విదేశాల్లో పర్యటించనున్నారు. ఈ బృందాల్లో పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీలు, మంత్రులు, దౌత్యవేత్తలు ఉన్నారు. ఒక్కో బృందంలో ఒక ముస్లిం నేత గానీ, అధికారి గానీ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 51 మందిలో 31 మంది ఎన్డీయే నేతలు, 20 మంది ఎన్డీయేతర పార్టీల నేతలున్నారు. 'ఒకే లక్ష్యం.. ఒకే సందేశం.. ఒకే భారత్' పేరుతో ఈ పర్యటనలు సాగనున్నాయి.

# సుప్రీంకోర్టులో వక్ఫ్ చట్టంపై విచారణ..

విచారణ పరిధిని కుదించవద్దని వారు కోరారు.గతంలో ఏప్రిల్ 17న జరిగిన విచారణ సందర్భంగా బై-యూజర్ సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అదేవిధంగా, వక్ఫ్ బోర్డులలో ఎటువంటి కొత్త నియామకాలు చేపట్టబోమని కూడా అప్పట్లో కేంద్రం స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించిన మూడు అంశాల్లో మొదటిది, వక్ఫ్ బై యూజర్ లేదా వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారానికి సంబంధించినది. ఇక రెండో అంశం, రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లిం వర్గాలు వ్యతిరేకించడం. మూడోది, వక్ఫ్ ఆస్తుల సర్వే బాధ్యతను సర్వే కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్‌కు బదిలీ చేసే నిబంధనపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు.

# ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన .. అధికారుల గుండెల్లో గుబులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని, అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సీఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం అన్నారు. లబ్ధిదారులు తమకు కావలసినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందన్నారు.రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు పరిశీలిస్తే, "మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా?" అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యత ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారన్నారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదని, పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని చెప్పారన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సీఎం సూచించారు.తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు . ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి, ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారని, గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి, కంపోస్ట్ తయారీ చేపడతామని సీఎం తెలిపారు.ప్రభుత్వ సేవల్లో డాటా అనలిటిక్స్ కీలకమని సీఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖలు తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలిటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సీఎం సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా జూన్ 12 నుంచి ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు సీఎం ప్రకటించడంతో అధికారుల గుండెల్లో ఇప్పటి నుంచే గుబులు రేగుతోందని అంటున్నారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటనలకు వచ్చిన సమయంలో ప్రజలు నేరుగా అధికారులపై ఫిర్యాదు చేసే అవకాశాలు ఉండటంతో వారిలో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 20)

కందుకూరు పట్టణంలోని తానికొండవారిపాలెంనకు చెందిన మద్రిపూడి సింగయ్య కుమార్తె హారిక చౌదరి వివాహం సందర్భంగా మంగళవారం ఇంటి వద్ద జరిగిన నలుగు కార్యక్రమానికి హాజరై హారిక చౌదరిని ఆశీర్వదించారు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు.

# టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించిన బండ్రెడ్డి రజని



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 20)

టంగుటూరు ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని స్థానిక భీమావారిపాలెం పార్క్ దగ్గర చిన్నారులతో కలసి బండ్రెడ్డి రజని టంగుటూరి పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి రజని చిన్నారులకు పంతులుగారి గురించి వివరించారు. టంగుటూరి ప్రకాశం పంతులు (1872 ఆగష్టు 23 - 1957 మే 20) సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యాడు. 1940, 50 దశకాల్లో ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాడు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందడని ప్రతి ఒక్క పౌరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అడుగుజాడల్లో నడవాలని తెలిపారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలి







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఒంగోలు మున్సిపల్ ఆఫీసు నుండి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన, ధర్నా జరిగింది. మంగళవారం దేశవ్యాప్తంగా అఖిల పక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఉమ్మడిగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునివ్వడం జరిగింది. దాంట్లో భాగంగానే ఒంగోలులో ఈ కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్మోహన్, ఏఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటేశ్వర్లు ,ఏఐయఫ్ టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎం ఎస్ సాయి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చాజిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పాల్గొని ప్రసంగించారు. రంగారావు మాట్లాడుతూ మోడీ విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని , పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని , ఉపాధి హామీ పథకం 200 రోజులు పెంచాలని , రోజుకి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని ,డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులర్ చేయాలని అనేక డిమాండ్స్ తోటి ఈరోజు ఈ కార్యక్రమం జరుగుతా ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా నాలుగు సంవత్సరాల నుంచి అనేక పోరాటాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా అన్ని రాష్ట్రాలకు సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. అన్ని రాష్ట్రాల్లో దీని కోసం కావాల్సిన ప్రయత్నం చేస్తా ఉన్నారు. ఈ ప్రయత్నం కూడా ఉమ్మడిగా ఐక్యంగా తిప్పికొట్టేటువంటి ప్రయత్నం చేస్తా ఉన్నాం.దానిలో భాగంగానే ఈ కార్యక్రమం జరుగుతుంది. కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్సోర్సింగ్ కార్మికులు కోట్ల సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం జరిగింది. కనీస వేతనాలు లేకుండా సామాజిక భద్రత లేకుండా కార్మిక చట్టాలు అమలు చేయకుండా కొద్దిపాటి వేతనంతోటి జీవనం గడపాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధానాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఉద్య మించాలని చెప్పి ఉద్యోగులకి కార్మికులకు పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేని పరిస్థితిలో తీసుకొచ్చిన అప్పులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి భారతదేశంలో చూస్తా ఉన్నాం. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు పార్లమెంట్లో చర్చలేకుండా తీసుకువచ్చి 400 రోజులుగా ఢిల్లీలో పోరాటం చేస్తా ఉంటే 750 మందిని పొట్టన పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం రైతు పండించిన గిట్టుబాటు ధర కావాలని, అలాగే బర్లీ పొగాకు సంబంధించి మద్దతు ధర ఇవ్వాలని చెప్పి డిమాండ్ చేయడం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని, 200 రోజులకు పని పెంచాలని, రోజుకి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని ఇంకా అనేక సమస్యలు ఉపాధి హామీ పథకం పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని చెప్పి ఆంజనేయులు డిమాండ్ చేయడం జరిగింది. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి మాట్లాడుతూ స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, నాయకులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి కల్పన, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, రాజశేఖర్, దాసరి సుందరం, జార్జి, సారధి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

# అన్నా రాంబాబును కలసిన కుందురు మల్లారెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 20)

పట్టణంలోని జవహర్ నగర్ కాలనీ నందు సోమవారం జరిగిన మార్కాపురం మండల ఉపాధ్యక్ష ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన కుందురు మల్లారెడ్డి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబుని మర్యాదపూర్వకంగా కలసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాపన్ రెడ్డి, ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చెంచి రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పఠాన్ ఇబ్రహీం ఖాన్ ఎంపిక



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 20)

మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పటాన్ ఇబ్రహీం ఖాన్ ఎంపిక చేశారు.మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పఠాన్ ఇబ్రహీంఖాను నిన్న నిర్వహించిన మినీ మహానాడులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణ అధ్యక్షుడు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అంకిత భావంతో పనిచేస్తానని, నాపై ఉన్న నమ్మకంతో పట్టణ అధ్యక్షుడు బాధ్యతలు సంపూర్ణంగా నిర్వహిస్తానని ఆయన అన్నారు ఈ సందర్భంగా మా అన్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

## ప్రకాశం



# రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20) క్షేత్రస్థాయిలో ఎలాంటి పెండింగ్ లేకుండా రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణతో కలసి రెవెన్యూ అధికారులతో సమావేశమై, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) లో వచ్చిన అర్జీల పరిష్కారం, జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూఅప్పగింత, రీసర్వే, రెవెన్యూ సర్వీసులు, వాటర్ టాక్స్ తదితర అంశాలపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరు కాబడిన లేదా ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూఅప్పగింత ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అందుకనుగుణంగా పనిచేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యను అర్థం చేసుకొని అనాలసిస్ చేసి నాణ్యతతో పరిష్కారం చూపాలన్నారు. ఆర్జీల పరిష్కారానికి సంబంధించి ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా ఎండార్స్మెంట్ చేశారా లేదా పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్, డివిజనల్ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం రెవెన్యూ అంశాలపై వచ్చే ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత తహసిల్దార్ల తో మాట్లాడుతూ నాణ్యతతో ఆర్జీల పరిష్కారినికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్, డివిజనల్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ చట్టాలు, రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. (తరువాయి 4లో...)

# కోతకు గురైన కరకట్ట ప్రాంతం పరిశీలన

### పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, మే 20) బాపట్ల జిల్లాలో నీటిపారుదల శాఖ, డ్రైనేజి శాఖలు నిర్వహించే మరమ్మత్తుల పనులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశిన నరేంద్ర వర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత జిల్లెలమూడి గ్రామంలోని నల్లమడ వాగులో కోతకు గురైన కరకట్ట ప్రాంతాన్ని వారు సందర్శించారు. నల్లమడ వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని,వాగు విస్తీర్ణం పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. నల్లమడ వాగు విస్తీర్ణతకు కావలసిన భూమి కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని బాపట్ల, రెవెన్యూ డివిజన్ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే పి టి ఛానల్ ను వారు తనిఖీ చేశారు. ఛానల్ నుండి నీటి సరఫరా నిలువుదల చేయడం వలన ఛానల్లోని ఇసుక మెటలను తొలగించాలని ఆయన అధికారులకు తెలిపారు. బాపట్ల కు చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోని పూడికలను తొలగించి, ట్యాంక్ యొక్క విస్తీర్ణాన్ని పెంచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు.దానికి సంబంధించి ప్రతిపాదన తయారు చేయాలని నీటిపారుదల శాఖ ఎస్.ఈ కి జిల్లా కలెక్టర్ సూచించారు. బాపట్లకు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుండి నీటి సరఫరాను 35 రోజుల నుంచి 60 రోజులకు పెంచాలన్నారు. అనంతరం నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్లోని గుర్రపుటెక్క, తూటుకాడ తొలగింపు పనులను జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే ప్రారంభించారు.

4

# ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20) ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఆంధ్రకేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, బి ఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ ను సన్మానించారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విలేకరులతో మాట్లాడుతూ, దేశస్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశాభివృద్ధిలో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ, ధైర్య సాహసాలకు ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రాజకీయాలలో వారు నెలకొల్పిన విలువలు మనకు ఆదర్శమన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ త్యాగం చేసి దేశ స్వాతంత్ర్యంలో పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

4







# బంగారు ఆభరణాల చోరీ

### సీసీ కెమెరాల సహాయంతో నిందితురాలి అరెస్ట్
### 127 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
### మీడియా సమావేశంలో సిఐ సుబ్బారావు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 20) మార్కాపురం పట్టణంలో ఇటీవల జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ దొంగతనానికి గురయ్యారు అని సిఐ సబ్బారావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆమె లగేజ్ బ్యాగ్‌లో ఉంచిన 127 గ్రాముల బంగారు ఆభరణాలు ప్రయాణ సమయంలో చోరీకి గురైనట్లు సమాచారం మేరకు ఈ ఘటనపై మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. అనుమానాస్పదంగా బస్సు నుంచి కంభం బస్ స్టాండ్ వద్ద దిగి వెళ్లిన వ్యక్తిపై దృష్టిసారించారు. గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ స్పాన్సర్ చేసిన సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు, నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి మొత్తం 127 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంలో పట్టణ సీఐ, పోలీస్ బృందం గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సమయోచితంగా స్పందించిన పోలీస్ శాఖకు పలువురు ప్రజాప్రతినిధులు, సంఘాలు ప్రశంసలు వెల్లువెత్తిస్తున్నాయి. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ సైదు బాబు, రూరల్ ఎస్ఐ అంకమరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం మనకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, ప్రకాశం భవనంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# కోతకు గురైన కరకట్ట ప్రాంతం పరిశీలన





నర్సాయపాలెం పంచాయితీ ప్రజలు వారి పంచాయితీలోని సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీలో చెత్త సేకరణ విషయమై వారు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నర్సాయపాలెం పంచాయతీ సెక్రెటరీ రాజును జిల్లా కలెక్టర్ చెత్త సేకరణ విషయమై ప్రశ్నించారు. ప్రతి ఇంటిలో తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి చెత్తను సేకరించాలని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లో పడవేయాలని, ఎక్కడపడితే అక్కడ పడవేసినట్లయితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఇంట్లోనే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి అందించుటకు గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సేకరించిన చెత్తను సమాధుల్లో పడవేయటకు గల కారణాలపై పంచాయతీ సెక్రెటరీని ఆయన ఆరా తీశారు. పంచాయతీకి ఎస్ డబ్ల్యూ పిసి ల్యాండ్‌కు జిల్లా రెవెన్యూ అధికారికి ప్రతిపాదన పంపాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ సెక్రటరీకి సూచించారు. తదుపరి జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే నల్లమడ వాగు లాకులను పరిశీలించారు. నల్లమడ వాగు లాకుల గురించిన వివరాలను నీటిపారుల శాఖ ఎస్.ఈ ని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు అక్కడ మొక్కలు నాటారు. నీటిపారుదల శాఖ డ్రైనేజీ శాఖలో మంజూరైన పనులన్నింటినీ ఏకకాలంలో యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన కాలంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకటరత్నం, డ్రైనేజీ శాఖ ఈఈ మురళీకృష్ణ, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ సలీమా, నీటిపారుదల శాఖ డ్రైనేజీ శాఖలకు చెందిన డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలి

రెగ్యులరైజేషన్ స్కీం 2025 ప్రక్రియ పై రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అందుకనుగుణంగా ప్రతి పాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. . గ్రామ స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలు పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌస్ సైట్ పట్టాల కొరకు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశమన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా రీసర్వే ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వక క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓలు లక్ష్మిప్రసన్న, వెంకట శివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వరకుమార్, సత్యనారాయణ, శ్రీధర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్, వివిధ సెక్షన్స్ సూపరింటిండెంట్స్, తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 20)

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే కేంద్రప్రభుత్వం కార్మికవర్గ సంఘటిత ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం.రమేష్ అన్నారు. లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని అప్పటి వరకు స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలుచేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పొదిలి చిన్న బస్టాండ్ నుండి పెద్ద బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు.అనంతరం రమేష్ మాట్లాడుతూ భారత దేశం ప్రస్తుత పరిస్థితులను గమనంలో కి తీసుకొని మే 20న దేశవ్యాప్త సమ్మెను కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేశారన్నారు. దేశ సమైక్యత దృష్ట్యా కార్మిక సంఘాలు సమ్మెను వాయిదా వేసినా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడిని ఆపకపోగా తీవ్రతరం చేసిందన్నారు. యూనియన్ హక్కు, సమ్మె హక్కు, బేరసారాలు శక్తిని నిర్వీర్యం చేసే లేబర్ కోడ్స్ అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడ మోడీ కార్మిక వ్యతిరేక వైఖరిని తేటతెల్లం చేస్తుందన్నారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరని ద్రోహం చేస్తున్నాయన్నారు. స్కీంవర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి బెనిఫిట్స్ కల్పించకపోగా సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందన్నారు. కనీసవేతనం అమలుచేయకపోగా పనిభారం పెంచుతుంద న్నారు. ప్రశ్నిస్తే ఉన్న ఉపాధిని ఊడగొడుతున్న ప్రభుత్వాలు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. అసంఘటితరంగ కార్మికులైన హమాలీ,ఆటో, ట్రాన్స్ పోర్ట్, బిల్డింగ్, బైక్ మెకానిక్స్ సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలని అన్నారు. పై సమస్యలు పరిష్కరించకుంటే జులై 9 దేశవ్యాప్త సమ్మెలో కార్మికవర్గం సంఘటిత శక్తి చవిచూడాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రదర్శన, ధర్నాలో సిఐటియు పొదిలి మండలం నాయకులు యస్ వెంకటేశ్వర్లు, టి యేసు, డి సుబ్బయ్య, జి నాగేశ్వరావులు పాల్గొన్నారు.

# దళిత విద్యార్థి జేమ్స్ పై దాడి అనాగరిక చర్య

## సుజన్ మాదిగ, వెంగలరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

తిరుపతి విద్యా నికేతన్‌లో బి.టెక్ చదువుకుంటున్న దళిత విద్యార్థి జేమ్స్ పై జరిగిన దాడి అనాగరిక చర్య, అవమానకరమైన దాడి అని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావులు సంయుక్తంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఖండించారు. గత రెండు రోజుల క్రితం తిరుపతిలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై, యశ్వంత్ నాయుడు అతని అనుచరులు విచక్షణరహితంగా దాడిచేసి, కులంపేరుతో దూషించి, తన మూత్రాన్ని తనకే తాగించి సభ్య సమాజం తలదించుకునేలా, పాశవిక చర్య చేసిన దోషులను కఠినంగా హత్యాయత్నం నేరం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్రంవచ్చి 75 ఏళ్లు దాటుతున్నప్పటికీ, పాలకులు మారిన దళితులపై దాడులు ,అవమానాలు ఇంకా ఆగలేదని, బీటెక్ విద్యార్థి జేమ్స్ పై జరిగిన దాడితో మరోసారి రుజువైందన్నారు. దళితులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయన్నారు. అగ్రకులానికి చెందిన యస్వంత్ నాయుడు అతని అనుచరులు జేమ్స్ పై చేసిన పాశవిక చర్యద్వారా, కులవివక్ష సమాజం నుండి వెళ్లలేదని మరోసారి రుజువైందన్నారు. ఈ కేసులో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, యశ్వంత్ నాయుడు కు సహకరించిన ప్రతి ఒక్కరినీ వదలకుండా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పిఎస్ నాయకులు గద్దే త్యాగరాజు, చాట్ల మహేష్, విజయరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# తల్లి - బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల సమస్యలు పరిష్కరించాలి

## సిఐటియు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

తొమ్మిదేళ్లుగా 'తల్లి - బిడ్డ ఎక్స్‌ప్రెస్ ' వాహనాల కెప్టెన్లు ( డ్రైవర్లు) గా పనిచేస్తున్న వారి సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని సిఐటియు డిమాండ్ చేసింది. 'ఆంధ్రప్రదేశ్ తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్' రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా మంగళవారం నాడు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. యూనియన్ కార్యదర్శి వి ఆర్ గంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు, జీవి కొండారెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన పాల్గొని వారు చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కేవలం రూ 7870ల వేతనంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పని చేయించుకోవడం అత్యంత దారుణమైన అంశంగా ఆరోపించారు. వారికి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేసారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీఐటియు అండగా ఉంటుందని ప్రకటించారు. సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్స్ విధానం పేరుతో 'వెట్టిచాకిరీ విధానం' అమలు అవుతుందని ఆరోపించారు. చట్టప్రకారం కనీసవేతనంగా రూ 26,వేలు అమలు చేయాలని ట్రేడ్ యూనియన్స్ డిమాండ్ చేస్తుండగా తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు కేవలం రూ 18500 వేతనం చెల్లించాలన్న న్యాయమైన డిమాండ్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ఇదే ప్రభుత్వం పథకం ద్వారా విస్తృత మైన ప్రచారం పొందుతూ, అందులో పనిచేస్తున్న వారికి కేవలం రూ 7870 లు వేతనం చెల్లించే ప్రక్రియ వీరిని ఉద్యోగులు అనడానికి, కార్మికులు అనేందుకు వీలుగా లేదన్నారు. ఉద్యోగులు లేదా కార్మికులుగా పరిగనించాలన్నా కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలన్నారు. నిరుద్యోగుల అసహాయతను రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము చేసుకుంటుందని దుయ్యబట్టారు. ఉద్యోగుల మద్దత్తుతో అత్యధిక మెజారిటీతో గెలిచిన కూటమి ప్రభుత్వం ' ఉద్యోగుల పట్ల నిరంకుశ ధోరణి' విడనాడాలని హితవు పలికారు. ప్రభుత్వం 'తల్లి బిడ్డ కెప్టెన్ల' సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన మాట్లాడుతూ తల్లి బిడ్డ వాహన కెప్టెన్ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. యూనియన్ ఉపాధ్యక్షులు గుంటి వెంకటేశ్వర్లు, నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా రూ.7870ల వేతనంతో బతుకుతున్న తమ సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో సహా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, మంత్రి నారా లోకేష్, హెల్త్ కమిషనర్ లకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు వంటి ఖర్చులు తమకు వచ్చే ఈ వేతనం తో ఎలా జీవించాలని వారు ప్రశ్నించారు? ప్రభుత్వం తమ సమస్యలపట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాలని కోరారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18500లు అమలు చేయాలని,ఇఎస్ఐ, పిఎఫ్ సదుపాయం కల్పించాలని, వారంతపు సెలవులు అమలు చేయాలని, ఆరోగ్య భీమా వంటి సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

### గౌరవాధ్యక్షులుగా ఎస్పీ బాలయ్య

### అధ్యక్షులుగా నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 20)

పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక సన్ షైన్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక ఎన్నుకున్నారు. పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగ సంఘం గౌరవ అధ్యక్షులుగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఎస్పీ బాలయ్య, అధ్యక్షులుగా పి సి నారాయణ రెడ్డి, కార్యదర్శిగా సిడిపిఓ ఈ సుధా మారుతి, ట్రెజరర్ గా వై బాల వెంకటరెడ్డి, బీసీలుగా డి. వంశీకృష్ణ, యు నరసారెడ్డి, బి శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా ఏ దివాకర్, టి. వి. నాగరాజకుమారి, కె సారా, జి. పుణ్యవతి లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎన్.వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆర్ వెంకటేశ్వర రెడ్డి బి మస్తాన్ నాయకులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి 11 మందితో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

# కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 22 రోజులుగా కొనసాగిస్తున్నారు. మంత్రి , అధికారులు సంఘ నాయకులతో చర్చించి మా సమస్యలు విని మానవత దృక్పథంతో పరిష్కార మార్గాన్ని ప్రకటించాలని కోరుతున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన తెలిపారు. ఈ క్రమంలో మేము అడుగుతున్న వేతన సవరణ అంశం కానీ, పెండింగ్ బకాయిలు కానివండి ఏది కూడా గొంతెమ్మ కోరికలు కాదు అని, 6 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం పెరగకపోగా రెండు సంవత్సరాలుగా ఉన్న బకాయిలు కోసం ఇలా సమ్మె రూపంలో ప్రభుత్వానికి మా బాధను వ్యక్తప రుస్తున్నాము ఇప్పటికైనా మా ఘోష మా ఆవేదన పట్టించుకొని పరిష్కరించాలని కోరుతున్నాం. దాంతో పాటు నిన్నటి రోజు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం హెడ్ క్వార్టర్స్ స్టే ఉండాలని రాత్రి 8 గంటలకు అటెండెన్స్ వేయాలి, 24 గంటలు అక్కడే వుండాలి, లాంటి వాటిని వ్యతిరేకిస్తున్న అని తెలిపారు. 80% మహిళలు ఉన్నారని, అలాగే హెల్త్ క్లినిక్లు స్మశానాల దగ్గర ఊరి బయట పొలాలలో ఊరికి చివర్లో ఉన్నాయని అక్కడ ఉండడం వలన మహిళలకు ఎలాంటి భద్రత ఉండదని సాయంత్రం నాలుగు తర్వాత విలేజ్ హెల్త్ క్లినికల్ దగ్గరికి గ్రామాల్లోని మందుబాబులు చేరి అక్కడ మందు తాగుతూ గొడవలు చేస్తున్నారని మహిళ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వాపోతున్నారు. ఢిల్లీ హైదరాబాదు లాంటి నగరాలలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే సరైన భద్రత లేదు..పల్లెటూర్లలో ఏ మాత్రం జనసంచారము లేని ప్రాంతాలలో విలేజ్ క్లినిక్ లో కట్టి అక్కడ ఉండమంటే మా భద్రతకు ఎవరు దిక్కు దయచేసి ప్రభుత్వ పెద్దలు ఆలోచించి నిర్ణయం తీసుకోగలరని మహిళ సీహెచ్‌వోలు విన్నపించుకున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు సమ్మె విరమించబోము అని జిల్లా నాయకులు గంట ప్రసన్న, కామేష్,జీవన జ్యోతి , రామాంజనేయులు తెలిపారు.





# ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయం

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయం అని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సంధర్భంగా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరిగా పేరుగాంచిన స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23న ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, వినోదరాయునిపాలెం గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనంలో కష్టపడి విద్యాభ్యాసం చేసి లండన్ లో బారిస్టర్ పాసై ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని, గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మేధావి, ధీరుడు, కార్యదక్షుడని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురుగా గుండె చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేనిదని, ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించాడని, 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజాసేవ కుడయ్యారని, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, ప్రకాశం పంతులు తెలుగువారి తెగువకు, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిలువెత్తు నిదర్శనమని, అలాంటి మహనీయుని జీవితాన్ని, ధైర్యసాహసాలు, పోరాట పటిమను నేటి, భావితరాలు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘువేంద్ర, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, ఆర్ఐ రమణరెడ్డి, ఏఆర్ ఎస్ఐలు ప్రసాద్, పాపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నమోదు సర్వే

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 20)



బాపట్ల మండలంలో సున్నా నుంచి 18 సంవత్సరాలు వయస్సు లోపు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే సర్వేలో సమగ్ర శిక్ష సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ సందర్భముగా వారు సమగ్ర శిక్ష ఏపీసి ఆదేశాలతో సమగ్ర శిక్ష ప్రత్యేక అవసరాల జిల్లా కోఆర్డినేటర్ ఎం జోష్ణ నేతృత్వంలో బాపట్ల భవిత సెంటర్ ఉపాధ్యాయినీలు కరుణకుమారి, రమాదేవిలు మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీరో టు 18 ఏళ్లలోపు వయసున్న, పైసన్న విభిన్న ప్రతిపావంతులైన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా వారికి మెరుగైన విద్యను ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను కిట్టులను ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు వినియోగించుకొని అభివృద్ధిలోనికి రావాలని వారు పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు 21 లోపాలు గల్లా చిన్నారులను గుర్తించి వారి సమాచారం సేకరిస్తున్నట్లు మంగళవారం చుండూరుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించిన పవిత్ర బాపట్ల సెంటర్ ఉపాధ్యాయునిలు తెలిపారు.

# కరేడు గ్రామంలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎంపిటిసి సభ్యులు మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 20)

మండలంలోని కరేడు గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ , మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా బైక్ యాక్సిడెంట్ అయి ప్రమాదకర పరిస్థితులలో మద్రాసు గుంటూరు హాస్పిటల్ నందు ప్రమాద స్థితిలో యువకులు ఉన్నారని అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశారు తప్ప స్పీడ్ బ్రేకర్లు వేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.


# కోవూరు రోడ్డులో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 20)



ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా కందుకూరులో పలువురు పుర ప్రముఖులు పాల్గొని ఘన నివాళు లర్పించారు. స్థానిక కోవూరు రోడ్డు ప్రకాశం సర్కిల్‌లో ఆంధ్ర కేసరి సేవా సమితి సభ్యులచే ప్రతిష్ఠించ బడిన నిలువెత్తు విగ్రహానికి సేవాసమితి బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు ఆంధ్ర జాతికి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమానికి నందనవనం రామ సుబ్బారావు, డాక్టర్ తన్నీరు మల్లిఖార్జునరావు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, పెట్లూరి సుబ్బారావు,చెక్కా వెంకట కేశవరావు, కేఎస్ వెంకటేశ్వర్లు, రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్.వి.), రావులకొల్లు బ్రహ్మానందం, ఏవి రావు, పిన్నమరాజు సురేష్, గాదిరాజు నాగరాజు, బి.జె.పి.వరప్రసాదరావు, శ్రీనివాసదీక్షితులు, జీ.వి.శేషగిరిరావు, వాకాణి శేషాచార్యులు,కాకర్ల రాజగోపాల్, గణపతిరాజు వాసుదేవరావు, సామాను బ్రహ్మయ్య, తదితరులు హాజరయ్యారు.

# ఘనంగా హనుమత్ జయంతి ఉత్సవాలు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 20)

పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఘనంగా హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలధారన ధరించిన స్వాములచే హనుమత్ హెూమాలు, హనుమత్ వ్రతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

## కొత్తపట్నంలో సంఘీభావ తిరంగా ర్యాలీ




(షణ్ముఖ వెలుగు, కొత్తపట్నం, మే 20)

పాక్ ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ,భారత దేశ త్రివిధ దళాలకు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతూ బీజేపీ పార్టీ శ్రేణులు కొత్తపట్నం పల్లేపాలెంలో తీరంగా ర్యాలీ నిర్వహించారు . మంగళవారం బీజేపీ కొత్తపట్నం ఇన్చార్జి మాకినేని అమరసింహం సారథ్యంలో జరిగిన ర్యాలీ నీ జిల్లా అధ్యక్షులు సెగ్గెమ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. భారత మాతకు జై అంటూ నినాదాలతో గ్రామంలో ర్యాలీ సాగింది,మరణించిన అమర జవానులకు ఘన నివాళి అర్పించారు. మోడీ నాయకత్వంలో దేశ భద్రత పటిష్టంగా ఉందనడానికి ఆపరేషన్ సింధూరం ప్రత్యక్షంగా చూసామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జి వీర భద్రాచారి, జె రమాదేవి, హానం ఆషారావు, కాటా రాధాక్రిష్ణ, సుబ్బారెడ్డి, పెరుమాళ్ళు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నిద్రిస్తున్న వృద్ధురాలిపై ఊడిపడిన స్లాబ్ పెచ్చులు వృద్ధురాలికి గాయాలు







(షణ్ముఖ వెలుగు, కంభం, మే 20)

కంభం పట్టణం కందులాపురం రోడ్డులోని ఆరాఫత్ నగర్‌లో నివాసం ఉంటున్న పఠాన్ శిలార్బీ(73సంవత్సరాలు) అనే వృద్ధురాలు ఇంట్లో మధ్యాహ్నం నిద్రిస్తున్న సమయంలో అనుకోకుండా స్లాబ్ పెచ్చులు ఊడి మొఖంపై పడటంతో గాయాలయ్యాయి.వైద్యం కోసం కంభం ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకొని వెళ్లగా మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తీసుకొని వెళ్ళమని వైద్యులు చెప్పడంతో మార్కాపురం ఆసుపత్రికి తీసుకొని వెళ్లిన కుటుంబ సభ్యులు.కేవలం పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తుంది ఆ వృద్ధురాలు.

## కిశోర బాలికలకు లింగ వివక్ష పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 20)

బంగారు బాల్యం, కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనిగిరి పరిధిలోని చింతలపాలెం ఎస్ సి కాలనిలోని ప్రాధమిక పాఠశాల నందు కిశోర బాలికలకు లింగ వివక్ష పై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలకు లింగ వివక్షత గురించి అవగాహన కల్పించడం అనేది సమాజంలో లింగ సమానత్వం సాధించడానికి చాలా ముఖ్యమని సీడీపీఓ పి. సరోజిని అన్నారు. ఈ అవగాహన ద్వారా బాలికలు లింగ వివక్షతను ఎదుర్కోవడానికి , సమాజంలో మార్పు తీసుకురావడానికి సహాయపడతారని తెలిపారు. ఈ సందర్భంగా లింగ వివక్షత అంటే ఏమిటో వివరించారు.లింగ వివక్షత యొక్క వివిధ రూపాలు, లింగ సమానత్వం యొక్క ప్రాముఖ్యత,లింగ వివక్షను ఎదుర్కొనుటకు మార్గదర్శకాల పై, 100, 112, 181, 1098 హెల్ప్ లైన్ నెంబర్లు పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ సుమతి, మహిళా పోలీస్ లు అనూష, లక్ష్మి,హెల్త్ సూపర్ వైజర్ ఉమామహేశ్వరరావు,ఎ ఎన్ ఎం శైలజ,పారా లీగల్ వాలంటీర్,సర్టిఫైడ్ మాస్టర్ రిసోర్స్ పర్సన్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ ఆయాలు, బంగారు బాల్యం కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్వాసపై ధ్యాసతో యోగాను సాధన చేస్తే ఆరోగ్యం

### ఆసుపత్రులకు వెళ్లనవసరం లేని జీవితం

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన మెగా యోగాసాధనలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్రంలోని విశాఖకు వస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యోగాపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శుల ఆదేశాల మేరకు జిల్లాలో రాబోయే నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యోగాను నిత్యం సాధన చేస్తే ఆసుపత్రులకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగమవ్వాలన్నారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలని, వీలైనంత ఎక్కువ మందికి అవగాహన కలిగించేందుకు కృషి చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభించాక జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యోగ సాధన పై అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రాబోయే నెల రోజులు ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేసుకొని ప్రతి గ్రామంలో యోగా సాధన చేసేవిధంగా అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులు, వాకర్ క్లబ్ సభ్యులు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ యోగాసనాలు చేశారు. ప్రాణాయామం, నాడీ సాధన, భుజంగాసనం, శలభాసనం తదితర ఆసనాలను విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఉత్సాహంగా చేశారు. చివరగా నయాగ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన చిన్నారులకు జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ యతిరాజ్, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు విగ్నేష్, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నెల్లూరు జిల్లా కి చేరుకున్న క్రియాశీలక కిట్లు పంపిణీ చేసిన సెంట్రల్ టీం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

దేశంలోనే మొదటిసారిగా కార్యకర్తల క్షేమం కోసం క్రియాశీలకతో సభ్యత్వం చేయించిన ఘనత అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌దే అని జనసేన నాయకులు నెల్లూరు సిటీ పర్యవేక్షకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. తనని ఎంతగానో ప్రేమిస్తున్న కార్యకర్తల సంక్షేమమే పరమావదిగా సాగిన యజ్ఞం జనసేన క్రియాశీలక సభ్యత్వం అన్నారు. క్రియాశీలక సభ్యత్వం చేసిన ప్రతి ఒక్కరికి ఐడెంటిటీ కార్డులు అందరి అందేవిధంగా చూడాలన్నారు. జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయం గోమతి నగర్ నందు పవన్ కళ్యాణ్ సెంట్రల్ టీం ఈరోజు క్రియాశీల వాలంటీర్లకు మెంబర్షిప్ ఐడీ కిట్లను అందజేశారు. నెల్లూరు సిటీ రూరల్ కు సంబంధించిన క్రియా వాలంటీర్లకు కిట్లు అందజేశారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు ఎంతో ఆసరా లభించిందన్నారు. ఒకరితో మొదలై దాదాపు 12 లక్షల మందికిపైగా సభ్యత్వం నమోదు చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు. జన సైనికులు గర్వంగా భావించే క్రియాశీల సభ్యత్వం ఐడి కార్డులు ప్రతి ఒక్కరికి అందజేసేందుకు గత సంవత్సరాల్లో పేర్చుకునేందుకే చాలా ఇబ్బంది పడ్డామన్నారు. విడివిడిగా గ్రేడ్ చేసి ప్రతి నియోజకవర్గానికి,ప్రతి వాలంటరీ కి అందే విధంగా సెంట్రల్ టీమ్ చాలా కృషి చేశారన్నారు. అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తన వ్యూహంతో మనం ఎంత పని చేసామో అంతకు రెట్టింపు గౌరవాన్ని మర్యాదని మనకి ఇచ్చారన్నారు. ఇదే హుందాతనాన్ని రేపటి సభ్యత్వాలను రెట్టింపు చేసి చూపుతాం... జనసేన పార్టీ జిల్లా పర్యవేక్షకులు ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ సహకారం తో మునుపన్నుడు లేని విధంగా నెల్లూరు జిల్లాలో అత్యధికంగా క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయించారన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వం నమోదు చేసిన వాలంటీర్లకు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందనల సందేశం తెలిపారు. మీ క్షేమమే వారి ఆశయమని కూడా అని తెలిపారన్నారు.







## టీడీపీ మహానాడు భోజన ఏర్పాట్ల కమిటీ సభ్యుడుగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

ఈ నెల 27 నుంచి కడపలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించే మహానాడుకు సంబంధించి భోజన ఏర్పాట్ల కమిటీ సభ్యులుగా నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం కాసేపటి క్రితం మహానాడుకు సంబంధించిన వివిధ కమిటీలను ప్రకటించింది. మహానాడుకు వచ్చే లక్షలాది మంది ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మొత్తం 20 మందితో మహానాడు భోజన ఏర్పాట్ల కమిటీని ఏర్పాటు చేశారు.



## ప్రజలను భాగస్వామ్యులు చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

జిల్లాలో రాబోయే నెల రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యులు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టాల్సిన యోగా అవగాహన కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న నేపథ్యంలో, యోగా ప్రాధాన్యతను ప్రజలందరికీ తెలిసేలా జిల్లావ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు నేటి నుంచి జూన్ 21 వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, జడ్పీ సీఈవో, డిఎం అండ్ హెచ్వో, ఆయూష్ శాఖల అధికారులు 30 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూలు తయారు చేయాలన్నారు. ఎంపీడీవోలు అందరూ మండల స్థాయిలో ఒక ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో కూడా స్థానిక ప్రజలకు యోగా ప్రాధాన్యతను వివరించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ వారి శాఖల పరిధిలో సిబ్బందికి కూడా అవగాహన కల్పించేలా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ యోగా అవగాహన కార్యక్రమాల్లో తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో 30 రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ప్రతి ఒక్కరిని కూడా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## జర్నలిస్టు రవీంద్ర బాబు మృతి చాలా బాధాకరం

### నివాళులు అర్పించిన ఎపిఎంపిఎ

### నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

చేజర్ల మండలంలో ఓ ప్రముఖ దినపత్రికలో పని చేస్తున్న తోట రవీంద్ర బాబు (జర్నలిస్టు) అనారోగ్య కారణాల వల్ల సోమవారం సాయంత్రం చనిపోవడం జరిగింది.కొంత కాలంగా అనారోగ్య కారణాలు తనను వెంటాడాయని తరచూ ఆసుపత్రికి వెళ్లి వస్తూ ఉంటాడని తోటి జర్నలిస్టులు తెలిపారు.చనిపోయిన విషయం తెలుసుకున్న పలు జిల్లా , మండల జర్నలిస్టులు ప్రత్యక్షంగా అలాగే సోషల్ మీడియా వేదికల ద్వారా నివాళులు అర్పించారు. అలాగే మంగళవారం ఆయన భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఎ.పి.ఎం.పి.ఎ) నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్ సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తోట రవీంద్రబాబు మృతి చాలా బాధాకరమని తెలిపారు. సమాజంలో జర్నలిస్టుల భవితవ్యం ఏమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్త పరిచారు.ప్రభుత్వాలు ఇకనైనా చొరవ తీసుకుని జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. చేజర్ల మండల జర్నలిస్టులు కామంచి హజరత్ బొగ్గల తిరుపతి రెడ్డి తదితర పాత్రికేయులు అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పించారు.



## మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల పై యువతకు అర్థమయ్యేలా అవగాహన నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై యువతకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ వారి చాంబర్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేరకు జిల్లావ్యాప్తంగా గంజాయి, పొగాకు, గుట్కా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో, జనసంచార ప్రదేశాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం వలన దుష్ప్రరిణామాలు, చట్టపరంగా అమలవుతున్న శిక్షల పై అవగాహన కల్పించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించాలన్నారు. కమిటీలోని సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి మాదకద్రవ్యాల నివారణకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎడి మహ్మద్ అయూబ్, సూపరింటిండెంట్ సంధ్యారాణి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్ఐవో వరప్రసాద్, బాలల సంరక్షణ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదాల సహకారంతో రాష్ట్ర స్థాయి 24వ ర్యాంక్ సాధించిన రేవూరు నిషిత



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 20)

నెల్లూరు పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి అందించిన సంపూర్ణ సహకారంతో ఈ నెలలో జరిగిన ఈసెట్ -2025 ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ లో(ఈసెట్ హాల్ టిక్కెట్ నెంబర్ 75180020060) జర్నలిస్ట్ రేవూరు వెంకటస్వామి కుమార్తె రేవూరు నిషిత ప్రవంతి రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకును సాధించింది. అన్ని విధాల సహాయ, సహకారాలు అందించిన మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డికి మా కుటుంబం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని సీనియర్ జర్నలిస్ట్ రేవూరు వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా మాకు అన్ని విధాలుగా సహకారం అందించిన నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాల పై ఉక్కు పాదం మోపాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 20)

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఎన్ఫోర్స్మెంట్ కార్యకలాపాలు మరింత పెరగాలి, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుక రేవుల వద్ద అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేని వాహనాలు రేవు నుంచి బయటకు వెళ్లరాదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుక తవ్వకాల నిషేధం అమలులోకి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్లే రహదారులను తొలగించాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేయాలన్నారు. ఆ వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. మరోసారి అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీసాక్ నివేదిక ఆధారంగా జెపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. జువ్వలపాలెం-2 ఇసుక రేవులో ఇసుక లభ్యత ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కొరకు జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ప్రకటించారు. జువ్వలపాలెం-2 రేవులో 24.9 హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అలాగే గాజుర్లంక ఇసుక రేవులో 19వేల మెట్రిక్ టన్నుల లభ్యత ఉందన్నారు. ప్రజల అవసరాల కొరకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మైన్స్ ఏడి రాజేష్, డిటిఓ పరంధామ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి సమస్యలు పరిష్కరించాలి



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మే 20)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నందనవనం పాపిరెడ్డిపల్లి మంగంపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలు గ్రామీణ హర్తల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. గత ఐదు నుండి ఏడు వారాల వరకు ఉపాధిలో పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కూలీలను తీవ్ర ఇబ్బంది పాలు చేస్తుందని ఆవేదన వ్యక్తపరిచారు. కొంతమంది కూలీలకు గత సంవత్సరంలో పనిచేసిన బిల్లులు సైతం రాలేదని తెలిపారు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు విడుదల చేయాలని వీరు డిమాండ్ చేశారు కనీస వేతనం 600 రూపాయలు కూలి పెంచుతూ ప్రతి జాబ్ కార్డుదారులకు 200 రోజులు పని గ్యారంటీ చేయాలని విజ్ఞప్తి చేశారు . తీవ్రమైన కరువు నీటి ఎద్దడి ఇతర ఎలాంటి ఉపాధి అవకాశాలు లేనటువంటి పశ్చిమ ప్రకాశం హనుమంతునిపాడు మండలంలో కూలీల వలస బాట పట్టకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు ఉపాధి కూలీలందరికీ ప్రభుత్వమే ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో మౌలిక వసతులు తాగునీరు ,మజ్జిగ ,టెంట్లు బట్టలు ఏర్పాటు చేయాలన్నారు. రవాణా చార్జీలు పనిముట్లకు ఇచ్చే బాడుగలు చెల్లించాలని నూతనంగా పనిముట్లు మంజూరు చేయాలని. మెడికల్ కిట్లు అందించాలని మెట్లకు అదనపు పారితోషం చెల్లించాలని ప్రతి వారం ప్లే స్లిప్పులు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా వీరు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్‌లు నాగూరు, నాసర్ వలి, రంజాన్ బి, సుబ్బరాయుడు, కోటయ్య, శివ, లక్ష్మీనారాయణ, కొట్టారు సుబ్బరాయుడు, ఆకుపాటి వెంకట్రావు, కావేటి రాధారెడ్డి, నారాయణరెడ్డి, గిద్దా వెంకటేశ్వర్లు, రాములు, తదితరులు పాల్గొన్నారు.



## చెరువులో పడి మృతి చెందిన కొడవలూరి శేషయ్య




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 20)

మండలంలోని పై రెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం పొన్నలూరు చెరువులో ఒకటవ నెంబర్ తూము వద్ద చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారీ నీటిలో పడి కొడవల్లూరి శేషయ్య (47)మృతి చెందాడు. శేషయ్య మధ్యాహ్నం 1 గంటల సమయంలో మృతి చెందాడు. శేషయ్యకు కొడుకు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య వరమ్మ ఎస్ఐ అనుక్‌కు ఫిర్యాదు ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

## రహదారులు, రైల్వే మార్గాలకు అవసరమైన ప్రణాళిక పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

జిల్లా నుంచి వెళుతున్న ప్రధాన రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేసుకొని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా చెప్పారు. ఆయా అంశాలపై మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణతో కలసి సంబంధిత 565, 544(డీ), 167(బీ), 765, 544 (జీ) , 2-2 కాళహస్తి రైల్వే మార్గాల నిర్మాణ ప్రాజెక్టులపై చర్చించారు. ఆయా నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ కోసం నిధుల చెల్లింపు, పెండింగ్ క్లెయిమ్స్, యాజమాన్య హక్కుల వివాదాలపై కలెక్టర్ ఆరా తీశారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను ఇందుకోసం రూపొందించుకోవాలని చెప్పారు. వీటి పురోగతిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారము, పునరావాస కేంద్రాల ఏర్పాటు, నిధుల చెల్లింపులపైనా కలెక్టర్ ఆరా తీశారు. కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు భూసేకరణపైన ఈ సమావేశంలో చర్చించారు. పాదర్తి, గుండాయపాలెం, పిన్నివారిపాలెం తదితర గ్రామాలలో భూముల లభ్యతను ప్రభుత్వము దృష్టికి తీసుకువెళ్ళి అవసరాన్ని బట్టి వాటిని సేకరించే విషయంలో ఒక స్పష్టత తీసుకోవాలని ఈ సందర్భముగా నిర్ణయించారు. ఈ సమావేశంలో డీఆర్వో బి. చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఒంగోలు డీఆర్వో బి.లక్ష్మీ ప్రసన్న, పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 20)

ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం రోజున విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల్లో దాగి వున్న సృజనాత్మక శక్తి వెలికితీసే క్రమంలో వారికి క్యారమ్స్,చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలిపారు.

## ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయం ఒంగోలు నందు ఆంధ్ర కేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా వారికి ఘనమైన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల వాహన తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు పరిపాలన అధికారులు సిబ్బంది, హోంగార్డ్స్ అందరూ పాల్గొని టంగుటూరు ప్రకాశం పంతులు వారికి ఘనమైన నివాళులర్పించారు.

## మా స్థలం మాకు ఇప్పించండి

### స్థలంలోకి వెళితే అడ్డుకుంటున్నారు
### మున్సిపాలిటీ వారు బోర్డులు పెడుతున్నారు
### కోర్టులో గెలిచిన, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదు
### బోరుమంటున్న ఆశాభి కుటుంబ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

ప్రభుత్వం వారు తమకిచ్చిన భూమిని వెంటనే తమకు అప్పగించాలని, అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆశాభీ మీడియా ముందు వాపోయారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆశాభి మాట్లాడుతూ తన భర్త షేక్ ఖాజావలి 2021లో పోలీస్ స్టేషన్లో లాకప్ డెత్ లో మరణించారన్నారు. దీంతో అప్పటి కలెక్టర్ ఎస్పీ ద్వారా రూ. 20 వేలు పరిహారం, పాత సుజాతనగర్ లోని సర్వే నెంబర్ 279/1బి1 లో 0.02 1/2 సెంట్ల భూమిని ఇచ్చారన్నారు. అయితే అప్పటినుండి ఆ స్థలంలో తాము గుడిసె వేసుకుంటుండగా పేరయ్య అనే వ్యక్తి తమకు అడ్డు తగులుతున్నారని, తమను స్థలంలోకి రానివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నరని ఆరోపించారు. పేరయ్య కోర్టులో కేసు వేశారని, కోర్టులో కూడా తమకు అనుకూలంగానే తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ పేరయ్య తనని స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదన్నారు. చివరకు మునిసిపాలిటీ వారు కూడా మున్సిపాలిటీ స్థలం అంటూ బోర్డులు పెట్టారని పేర్కొన్నారు. చివరికి కలెక్టర్ ను కలిసినా ఫలితం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి స్థలం ని తమకు ఇప్పించవలసిందిగా కోరారు. సమావేశంలో ఆశాభి ఇద్దరు కుమార్తెలు పాల్గొన్నారు.

# జీవోఎంఎస్ 4ను వ్యతిరేకిస్తూ తహసీల్దార్‌కి వినతి పత్రం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 20)

రాష్ట్ర ప్రభుత్వం రేషన్లైజేషన్ క్లస్టర్ విధానంలో వీఆర్వోల క్యాడర్ ను తగ్గిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ నాలుగును వ్యతిరేకిస్తూ స్థానిక విఆర్వోలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం నాయకులు బాల వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఇచ్చిన జీవో నెంబర్ 4 వల్ల వి.ఆర్.ఓ.ల కేడర్ కు, ప్రమోషన్ల ఛానల్‌కు, మిగులు సిబ్బందిగా వీఆర్వోలను నియమించుట గురించి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మిగులు సిబ్బంది సమస్య కాకుండా ఉన్న విఆర్వోలు కూడా పని ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మా రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రేషనలైజేషన్ క్లస్టర్ విధానంలో జరుగుతున్న లోపాలను గ్రహించి పలు పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన, రాష్ట్ర ఉన్నతాధికారులకు విన్నవించిన కానీ ప్రభుత్వం జీవో నెంబర్ నాలుగు విడుదల చేయడంతో తాము తీవ్ర ఆందోళనలో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు బాల వెంకటరెడ్డి, అనిల్, నారాయణ, సుబ్బారావు, సంతోష్, విఆర్ఏ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# 25న ఆత్మకూరి చెన్నయ్య వర్ధంతి సభ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

బహుజన పోరాట యోధుడు ఆత్మకూరి చెన్నయ్య పదో వర్ధంతి సభ ఒంగోలు సిపిఐ ఆఫీసులో మే నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరి చెన్నయ్య స్మారక సమితి కన్వీనర్, న్యాయవాది కాటుకూరి బాబూ రావు తెలిపారు. ఈ మేరకు ఒంగోలు అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక సామాజిక విముక్తి పోరాటాలకు చెన్నయ్య కేంద్ర బిందువుగా నిలిచారని అన్నారు. అదే సందర్భంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాన్యవర్ కాన్షిరాంను జిల్లాకు తెచ్చి గొప్ప బహుజన ఉద్యమాన్ని నిర్మించిన వారిలో చెన్నయ్య అగ్ర స్థానంలో నిలిచారని అన్నారు . ఈ వర్ధంతి సభలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి అంబేద్కర్ బౌద్ధ దృక్పథంపై స్మారక ఉపన్యాసం చేస్తారని , ప్రముఖ రచయితలు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఈ వర్ధంతి సభలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్మారక సమితి ప్రతినిధులు దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, డాక్టర్ నూకతోటి రవికుమార్, పారాబత్తిన బ్రహ్మయ్య, కనపర్తి శివరాం, మన్నం వెంకటేశ్వర్లు, కాకుమాను కిరణ్ కుమార్, చప్పిడి కోటేశ్వరరావు, పాపబత్తిని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మలమడకలో పడకేసిన పారిశుద్ధ్యం

### పట్టించుకోని అధికారులు

### చెరువులను తలపిస్తున్న మురుగు నీరు

### దుర్వాసనతో అల్లాడుతున్న ఎస్సీ కాలనీవాసులు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 20)

మాచర్ల నియోజకవర్గంలోని అమ్మని జమ్మలమడక గ్రామంలో ఎస్సీ కాలనీ నందు మురుగునీరు రోడ్లపై పారుతూ చెరవులను తలపిస్తున్నాయి. ఎస్సీ కాలనీవాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన రావడం వలన కుక్కలు పందులు దోమలు ఈగలు ఎక్కువగా సంచరిస్తున్నాయని కాలనీవాసులు వాపోయారు. కాలువలు శుభ్రం చేసేవారు రాక కాలువల నుండి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ నడవడానికి కూడా ఇబ్బంది కలిగిస్తున్నాయని వారు తెలిపారు. వచ్చేది వర్షాకాలం వర్షాలు పడడం వలన మురుగు నీరు మరింత రోడ్లపై చేరి ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉందని, ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది అని,ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్య ధోరణి వదిలి మురుగు కాలువలను శుభ్రం చేసే పనులను వెంటనే చేపట్టాలని కాలనీవాసులు అధికారులను వేడుకుంటున్నారు.


# త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## రజక కాలనీలో తాగునీటి పైప్ లైన్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మక్కెన శంకుస్థాపన









(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 20)

వినుకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాస్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో శుద్ధమైన నీరు పరిశుభ్రమైన కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, కాలువల్లో చెత్త పేరుకుపోకుండా డ్రైనేజి వ్యవస్థ శుభ్రం చేయడం వంటి పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని రాజీవ్ రజక కాలనీలో తాగునీటి పైప్ లైన్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకం ద్వారా రూ.19.89 లక్షలతో 250 ఇళ్లకు సురక్షిత జలాలు సరఫరా చేసేలా పైప్ లైన్ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పైప్ లైన్ ఏర్పాటుతో కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు దూరమవుతాయని తెలిపారు. ఇప్పటికే అమృత్ పథకంలో కాలనీలకు నీటి సరఫరా మెరుగుపరచడానికి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. మక్కెన మల్లికార్జునరావు సహకారంతో ఈ రజక కాలనీ ఏర్పాటైందని, దీన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చి సురక్షిత మంచినీరు సరఫరా చేస్తామన్నారు. త్వరలో అంతర్గత రోడ్లు, అంగన్వాడీ కేంద్రం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. అనంతరం డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ కాలనీ ఏర్పాటు చేశామని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జీవీ ఆంజనేయులు కూడా ఈ కాలనీ ఏర్పాటుకు పూర్తిగా సహకరించారని, ఎంతోమంది ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించాలని చూసినా మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవడం తగదని ప్రోత్సహించిన ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గ్యారేజీని సందర్శించిన ప్రకాశం జిల్లా ఏపీఎస్ఆర్టీసీ

## ప్రజా రవాణా అధికారి వి సత్యనారాయణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 20)

మంగళవారం సాయంత్రం ప్రకాశం జిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి వి సత్యనారాయణ ఒంగోలు డిపో గ్యారేజీ సందర్శించి మరమ్మతులు చేయుచున్న వాహనములను గ్యారేజీని సందర్శించారు. మెరుగైన ఆర్టీసీ బస్సులను ప్రయాణికుల అందించుటలో భాగముగా ఈరోజు మెయింటైన్ చేసిన వాహనమును డిపో మనేజరు, కార్మికులతో కలిసి రోడ్ టెస్ట్ చేసి బస్సు యొక్క కండిషన్ను స్వయముగా పరిశీలించడం జరిగింది. మెరుగైన బ్రేక్ డౌన్ ఫ్రీ, శుభ్రత, నాణ్యమైన బస్సులను ప్రయాణికులు అందించవలసినదిగా గ్యారేజ్ సిబ్బందికి తెలియచేసి ఉన్నారు.

# దొంగ సొమ్ముకు పాల్పడి జైలు పాలైన కిలాడి లేడీ

## చాకచక్యంగా పట్టుకున్న కొండపి పోలీసులు





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 20)

గత వారం రోజుల క్రితం కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన దొంగతనంను అతి తక్కువ సమయంలో కనిగిరి డిఎస్పి ఆధ్వర్యంలో కొండపి సిఐ జి సోమశేఖర్, కొండేపి యస్ఐ ప్రేమ్ కుమార్ రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం అనకర్లపూడి మద్దులూరు గ్రామాల మధ్య ముద్దయిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నూట అరవై గ్రాముల బంగారం సుమారు పదిహేను లక్షల విలువ కలిగిన ఆభరణాలను రికవరి చేశారు. ముద్దాయి చీరాల మండలం చీరాల గ్రామానికి చెందిన చౌట అంజలిగా గుర్తించారు. ఈమె పై కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ అభినందించారు.

# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 20)

మాచర్ల పట్టణంలో జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదిన వేడుకలను మాచర్ల నియోజకవర్గ ఎన్టీఆర్ యూనియన్ ప్రెసిడెంట్ షేక్ సైపుల్ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కేక్ కట్ చేసి ఒకరికొకరు నోటిని తీపి చేసుకొని జూనియర్ ఎన్టీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జూనియర్ ఎన్టీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రొట్టె,పండ్లను పంపిణీ చేశారు. రక్తదానం నిర్వహించారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి. అనాధ ఆశ్రమంలో పిల్లలకి మరియు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు.రవికుమార్. వాసు. హుస్సేన్. విజయ్. బంగారం. రామ్. లక్ష్మణ్. నరేంద్ర. నాగరాజు. ఖలీల్. మణికంఠ. మరియు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com